# కథ

# ప్రణయామృతం

ఎ. కరుణకుమార్

**“హలో..పిలుస్తోంటే అలా వెళ్లిపోతావేం!” ప్రశ్నించింది శోభ.**

**చూసీచూడనట్లు, పట్టీపట్టనట్లు ముభావంగా వెళ్లిపోతున్నాడతడు.**

**“హలో వినయ్, నిన్నే ఆగు!” వెంటపడుతూ పిలుస్తోందామె.**

**ఏమిటన్నట్లు వెనక్కి తిరిగి చిరాగ్గా చూశాడతడు.**

''హమ్మయ్య, ఆగావు సంతోషం! పిలుస్తుంటే అలా వెళ్లిపోతావేంటి?''

''నేను పార్క్‌కి ప్రశాంతత కోసం వస్తాను. దాన్ని భంగం చేసుకోవటం ఇష్టం లేక''

''అంటే.. ఆ భంగపాటుకు కారణం నేనేనా!''

''వేరే చెప్పాలా?!''

ఉక్కిరిబిక్కిరయ్యే ఆనందంతో అతడి వెనుకాలే ఆమె.

''వినయ్ రోజూ నువ్వు పార్క్‌కి వస్తున్నావా?'' ఒయ్యారంగా నడుస్తూ అంది శోభ.

''....''

''ఏంటి వినయ్ మాట్లాడవేం?''

''రేపట్నుంచి రాను..!'' సీరియస్‌గా అని నడక వేగం పెంచాడతడు.

''అదేంటి వినయ్, నేను రాక్షసినా, దెయ్యాన్నా నేను వస్తే నువ్వు రాకుండా ఉండటం దేనికి?''

''ఇందుకే. నాకు ఎక్కువగా మాట్లాడేవాళ్లంటే చిరాకు శోభా! నాకు కావాల్సింది ప్రశాంతత. ఒకటి లేదా రెండు మాటలు అంతే''

''ఐ లవ్ యూ! ఒక్కటే మాట'' చేతులు కట్టుకొని నిలబడి అతడి కళ్లలోకి సూటిగా చూస్తూ అనేసింది శోభ.

''డెబ్బై ఒకటో సారి!'' చేతిలోని పెన్నుతో నుదుటిపై కొట్టుకుంటూ పలికాడతడు.

''అబ్బో ఫర్వాలేదే! బాగానే ఆలోచిస్తున్నావు నా గురించి'' అతడిని అడ్డగిస్తూ అల్లరిగా నవ్వుతూ అందామె.

''నేనా.. నీ గురించా... ఆలోచించటమా నో వే!''

''కహానీలు వద్దమ్మా! నేను ఎన్నిసార్లు ఐ లవ్‌యూ చెప్పానో టక్కున చెప్పావంటే నా గురించి మరి ఆలోచిస్తున్నావనేగా అర్థం!!'' కవ్వింపుగా కళ్లెగరేస్తూ అంది శోభ.

''ఓ.షిట్..గెట్‌లాస్ట్!''

''వినయ్, టుడే ఈజ్‌మై బర్త్‌డే! విషెస్ చెప్పవూ?'' ఒక్కసారి గాలి బలంగా పీల్చి వదులుతూ వెనక్కి తిరిగి బలవంతంగా ఓ చిరునవ్వును అరువు తెచ్చుకున్నాడతడు.

''నాకు ముందే ఎందుకు చెప్పలేదు?''

''నువ్వు కోపంలో బాగుంటావు వినయ్! అందుకు..''

''ఓకే.. హ్యాపీ బర్త్‌డే. నువ్విలా వంద పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తాను''

''అంత అవసరం లేదు. నీ మనసులో చోటిస్తే చాలు మరో వంద పుట్టిన రోజులు ఈజీగా జరుపుకోగలను''

''నీతో మాట్లాడడం నా వల్ల కాదు!''

''ఒక్క నిమిషం'' చేతిలోని స్వీట్ ప్యాకెట్‌ని అతడికి అందించిందామె.

దాన్ని తీసుకొని వెళ్లబోయేంతలో...

''వినయ్, తినేసి వెళ్లు!''

గబగబ రేపర్స్ విప్పేసి స్వీట్‌ను నోట్లో కుక్కుకొని పక్కన పడవేయబోయాడతడు.

''ఆగాగు.. ఆ రేపర్స్‌ను పడవేయకు అది నాకు కావాలి!''

''పిచ్చి..!'' కోపంగా దాన్ని ఆమెపై విసిరి వేగంగా వెళ్తున్న అతడి చెవులకి వినిపించింది-

''నూటొకటోసారి నేను నీకు అబద్ధం చెప్పడం!'' కళ్లల్లో చిలిపితనాన్ని గుప్పించి, నాలుక బుగ్గన జొప్పించి తిప్పుతూ ఒయ్యారంగా నిలబడి అందామె.

కోపంగా చూస్తూ వెళ్లిపోయాడు వినయ్.

శోభ, వినయ్ ఇద్దరూ ఇద్దరే. మొండివాళ్లు! ఇంటర్ నుంచే మొదలైంది ఈ దోబూచులాట! ఇద్దరి ఇళ్లు పక్కపక్కనే. వయసులోకి వచ్చిన తరువాత పరువపు ఆలోచనలు వినయ్ రూపంలోనే ఎదిగాయి శోభలో. పదహారణాల అచ్చతెలుగుదనం ఉట్టిపడే శోభంటే వినయ్ కుటుంబ సభ్యులందరికీ ఇష్టమే. వినయ్ తల్లి భార్గవి, శోభ మంచి స్నేహితులుగా ఉంటారు. భార్గవికి శోభను కోడలిగా చేసుకోవాలని తాపత్రయం. వినయ్ లాంటి ఉత్తముడు అల్లుడైతే అంతకన్నా అదృష్టమేముంటుందని అనుకుంటుంటారు శోభ తల్లిదండ్రులు.

చిరాకుపడిన ప్రతీసారీ 'జస్ట్ టేకిటీజీ' అనే సూత్రం జపించడం శోభకి అలవాటయిపోయింది.

ఆరేళ్లుగా సాగుతున్న ఈ డ్రామాకి ఈరోజు శుభంకార్డు వేసెయ్యాలని ఆలోచిస్తోంది శోభ. మరి వచ్చిన అవకాశం అటువంటిది!

''హాయ్ హవ్ ఆర్‌యూ!'' తలుపు తెరచి చిలకలా పలకరించిందామె.

''ఫైన్'' అని చెప్పలేకపోయాడతడు. ఆమెకేసి విస్తుపోయి చూస్తూ గుమ్మం వద్దే నిల్చుండిపోయాడు.

''సర్‌ప్రైజ్.. నేను ఈ టైమ్‌లో మీ ఇంట్లో ఉంటానని నువ్వు ఊహించి ఉండవు కదూ!'' కవ్వింపుగా కళ్లెగరేస్తూ అంది శోభ.

''కాదు! నువ్విప్పుడు ఇక్కడ ఎందుకున్నావని ఆలోచిస్తున్నాను'' లోపలికొచ్చి షూస్ విప్పుతూ అన్నాడు వినయ్.

''మీ వాళ్లు, మా వాళ్లు కలసి తిరుపతి వెళ్లారు! నిన్ను జాగ్రత్తగా చూసుకొమ్మని మీ అమ్మ నాకు అప్పజెప్పి వెళ్లింది!! అందుకే ఇక్కడ ఉన్నాను'' అసలు విషయం చెప్పింది.

''తిరుపతి వెళ్లారా?'' అతడి కళ్లల్లో ఆశ్చర్యం.

''ఏం.. నీతో చెప్పలేదా?''

''లేదే. మొన్నామధ్య అనుకుంటుంటే విన్నాను. సడన్‌గా ఇప్పుడు చెప్పాపెట్టకుండా వెళ్లిపోతారనుకోలేదు.''

''ఊ! నువ్వు కేవలం నాతోనే ఇలా ఉంటావనుకున్నాను. ఇంట్లో వాళ్లే చెప్పాపెట్టకుండా వెళ్లారంటే నీ ధోరణి ఎంత విచిత్రమైందో అర్థమవుతోంది'' ఉడికించిందామె.

''తీరిగ్గా అర్థం చేసుకుందువు గానీ, ముందు ఇక్కడ్నుండి వెళ్లు'' నిర్మొహమాటంగా అన్నాడు.

''ఎక్కడికెళ్లమంటావ్! మా వాళ్లు కూడా తిరుపతి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే నాకు భయం.''

''నువ్వు కూడా వెళ్లొచ్చు కదా తిరుపతి''

''నేను వెళ్లిపోతే నిన్నెవరు చూసుకుంటా రోయ్? దొరికిన చాన్స్‌ని వదులుకోదల్చుకోలేదమ్మా'' మెల్లిగా సణిగిందామె.

''ఏంటన్నావ్?''


''ఏం.. లేదే''

''నువ్విక్కడ ఉంటే నాకు ఏకాగ్రత కుదరదు. ప్లీజ్ వెళ్లు శోభ!'' కూల్‌గా అడిగాడతడు.

''ఏం.. అంత టెంప్టింగ్‌గా కనిపిస్తున్నానా?'' అతడి కళ్లలోకి కవ్వింపుగా చూస్తూ అంది.

ఆమె వెళ్లదని అతడికి అర్థమైపోయింది. అనవసరంగా ఆమెతో వాదులాడడం ఇష్టం లేక మౌనంగా ఊరుకున్నాడు.

''వినయ్ నన్నిలా చూస్తుంటే నీకేమనిపించటంలేదా!'' వాలుగా గోడకానుకొని జడకుచ్చులను సోయగంగా తిప్పుతూ కవ్వింపుగా అన్నది శోభ.



''ఒకటనిపిస్తోంది. నిన్ను అర్జెంటుగా మెంటల్ హాస్పిటల్‌లో జాయిన్ చేస్తే మంచిదనిపిస్తుంది. బాపుబొమ్మలా ఇలా పట్టుపరికిణీ పావడ వేసుకొని ఫోజుకొడితే నేను ఇష్టపడతాననుకున్నావా!''

''నీ ప్రేమ కోసం ఆశగా ఆరేళ్ల నుండీ ఎదురు చూస్తున్నాను! ఎందుకు నేనంటే నీకు అంత చులకన! చెప్పు.. ఇన్నేళ్లల్లో ఒక్క క్షణమైనా నా మీద నీకు ప్రేమ కలుగలేదా?'' ఆమె కళ్లల్లో కన్నీరు.

''నీమీద నాకు ఎటువంటి ఫీలింగ్స్ లేవు. ఏదో నిన్ను సంతోషపెడదామని నీపై ప్రేమను నటిస్తే అది నన్ను నేను మోసం చేసుకుంటూ నిన్ను మోసం చేసినట్లవుతుంది. ప్లీజ్ కష్టమో, నష్టమో నన్ను మర్చిపో. అది నీకూ మంచిది నాకూ మంచిది. నువ్వు బాధపడుతూ నన్నూ బాధపెట్టొద్దు''

''అంతేనా!''

''అంతే!''

''అయితే నా మాట కూడా విను. నువ్వు ఎంత వద్దనుకున్నా నేను నిన్ను మర్చిపోయేది లేదు. నాలో ఊపిరి ఉన్నంత వరకు నేను నీవెంటే..! ఐ లవ్ యూ.''

''విసిగించకు శోభ. వెళ్లు నేను కాసేపు వర్క్ చేసుకోవాలి''

''చేసుకో బాగా వర్క్ చేసుకో. నీకు నీ పుస్తకాలు, ప్రాక్టీసులు, లాబ్‌లు, టెస్ట్‌లు తప్ప ఇంకేమీ ముఖ్యం కాదు! ఎన్నాళ్లిలా ఒంటరిగా ఆనందం లేని జీవితం గడుపుతావు. నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు వినయ్! ఒక్క నిమిషం నా కళ్లలోకి చూడు. నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో తెలుస్తుంది''

''తెలుస్తూనే ఉంది నువ్వెంత వెర్రిదానివో. ఎంతసేపు నీ ధోరణిలోనే ఆలోచిస్తావే గానీ నా గురించి పట్టించుకోవే! లైఫ్‌లో ఏదన్నా సాధించాలనుకునే తపన ఉన్నవాడికి ప్రేమ పెళ్లిళ్ల గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించే తీరిక ఉండదు. అస్సలు నాకు ప్రేమ మీదే నమ్మకం లేదు.. ఇక నీ విషయమంటావా? టైమ్‌పాస్ కోసం నన్ను వేధిస్తున్నావు!''

అతడి మాటలు పూర్తి కాక ముందే ఉక్రోషంతో కదిలి వెళ్లి అమాంతంగా అతడి మెడ చుట్టూ చేతులు వేసి ముఖానికి దగ్గరగా జరుగుతూ పెదవులపై పెదవుల్ని ఆన్చి గాఢంగా చుంబించిందామె. ఆ చర్యకు నిశ్చేష్టుడైపోయాడు వినయ్. ఆమె మధుర చుంబన నుండి విడుదల పొందాలనిపించలేదు. ఉన్నట్టుండీ అతడిలోని వివేకం మేల్కొని ఆలోచనల్ని భగ్నం చేయాలని మండించింది!

ఆమెను విదిలించుకుని చెంప చెళ్లుమనిపించాడు.

పది నిమిషాలు గడిచాయి. గది తలుపు చప్పుడు కావటంతో తెరిచి చూశాడు వినయ్. ఎదురుగా చెంపన చెయ్యి వేసుకొని జాలిగా నిలబడి చూస్తున్న శోభ!

''ఏంటి?''

''భోజనం!'' గొంతు పెగల్చుకొని ముభావంగా అంది శోభ.

''నాకు ఆకలిగా లేదు. నువ్వు తినేసి పడుకో''

''నువ్విప్పుడు రాకపోతే నేను భోజనం మానుకొంటాను! కానీ నాకు బాగా ఆకలిగా ఉంది రా''

ఇక తప్పదన్నట్లు డైనింగ్ టేబుల్ వద్దకు నడిచాడతడు. మళ్లీ ఇద్దరూ మామూలు ధోరణిలో పడ్డారు.

''ఇన్నా..! తినటానికేనా? ఏదన్నా హోటలికి సప్లై చేస్తున్నావా?'' టేబుల్‌పై ఉన్న పదార్థాలను ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు వినయ్.

''ఇవి చాలా తక్కువ!! రేపు ఇంతకంటే ఎక్కువ చేస్తాను''

''నువ్వింత రిస్క్ తీసుకొని నెలకు సరిపడే మా ఇంట్లోని సరుకులన్నీ ఒక్కరోజుకే ఊడెయ్యాల్సిన అవసరం లేదు. రేపు ఉదయమే నేను వైజాగ్ క్యాంప్‌కెళ్తున్నాను''

''ఇవన్నీ చేసింది మా ఇంట్లోని సరుకులతో, మీవి కావులే ఏమీ దిగులు పడకు.''

''ఖాళీగా ఉండి మీ నాన్న సంపాదనను ఇలా హారతి చేస్తున్నావన్న మాట!''

''హలో చాలా రాంగ్‌గా ఆలోచిస్తున్నావు! ఇవి మా నాన్న సంపాదనతో కొన్నవి కావు. నేను కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్నవి. ట్యూషన్స్, ఎంబ్రాయిడరీ, డాన్స్ క్లాసెస్ నా పార్టయిమ్ వర్క్స్.''

''అంత కష్టపడి సంపాదించిన డబ్బు పొదుపు చేసుకున్నట్లయితే నీ భవిష్యత్తుకు ఉపయోగపడేది కదా! ఇలా వేస్ట్ చేసుకోవటం దేనికి?''

''ఇంకొక్కసారి వేస్ట్ అనే మాట నీ నోట్లోంచి వచ్చిందంటే చంపేస్తాను. నా ఆనందం కోసం నేనేమైనా చేస్తాను. ఇక మాటలాపి తిను'' కోపంగా కసురుకుంది శోభ.

''అవును.. ఇవన్నీ నువ్వే చేశావా?'' అన్నం కలుపుకుంటూ ప్రశ్నించాడు వినయ్.

''ఏం..డౌటా?''

''ఇందాక జరిగిందానికి నేను చాలా బాధపడుతున్నాను! నిన్ను కొట్టి ఉండకూడదు. అయామ్ సారీ!''

''దేనికి సారీ..! అవసరం లేదు''

''అయినా.. నువ్వలా ప్రవర్తించటం తప్పే! అవునా..!''

''అవును. తప్పే.. ఇంకాస్త ప్రాసీడవ్వాల్సింది కేవలం ముద్దుతోనే సరిపెట్టుకున్నాను!''

''నీకసలు సిగ్గులేదు శోభా..''

''నీ ముందు నాకది అవసరం లేదు వినయ్''

''నీలో మార్పొస్తుందనుకోవటం నా అవివేకం''

''తెలిసింది కదా! ఇక నీ ప్రయత్నం మానుకో''

''నేను చెప్పేది విను శోభా. లైఫను కొంచెం సీరియస్‌గా తీసుకో. నువ్వు బి.కామ్ ఫస్ట్‌క్లాస్! సి.ఎ. చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఏమంటావు?'' నచ్చచెప్పాలని చూశాడు వినయ్.

''ఓకే వినయ్ నువ్వన్నట్టే సి.ఎ. చేస్తాను. సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటాను. మరి నన్ను పెళ్లి చేసుకుంటావా?'' అతడి కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగిందామె.

''ప్రతి విషయానికీ పెళ్లితో ముడిపెడతావేంటి? చూడు శోభ.. పెళ్లనేది పైకి అందమైన ఉద్యానవనంలా కనిపిస్తుంది. లోపలకి వెళ్లాక కానీ తెలియడం అది పెద్ద ముళ్ల కంప అని! తెలిసి తెలిసి ఆ ముళ్లకంపలోకి నేను అడుగుపెట్టలేను''

''సరే.. నీకు పెళ్లంటేనే ఇష్టం లేదు. నేను కాదు కదా?''

అతను ఏమీ మాట్లాడలేకపోయాడు.

''వినయ్ నేను కోరుకునేది సంపాదనను, కీర్తి ప్రతిష్టలనుకాదు. కడవరకు తన చేయి పట్టుకొని నడిపించే వాడి ప్రేమ కోసం తపనపడుతున్నా. కాబట్టే నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాను. ఐ లవ్ యూ వినయ్''

అతను సైలెంట్‌గా వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లిపోయాడు.

''వినయ్ నన్ను పెళ్లి చేసుకోవడం నీకు ఇష్టం లేదు సరే.. నన్ను ఉంచుకుంటావా పోనీ?'' ఆవేశంగా అంది శోభ. ఆమె అలా అనటంతోనే తన చేతిలోని నేప్‌కిన్‌ను మండిపడుతూ ఆమె ముఖంపై విసిరికొట్టాడు. అప్పటివరకు ప్రశాంతంగా మాట్లాడిన శోభ ఆవేశంతో ఊగిపోతూ అతడి షర్ట్ కాలర్ పట్టేసుకుంది.

''ఏరా! ప్రేమిస్తున్నాననే ఆడ పిల్లంటే నీకంత చులకనా! ఏం తక్కువ నాకు అందం లేదా చదువు లేదా? నువ్వు ఎంత వద్దనుకున్నా నేను నిన్నే ప్రేమిస్తుంటాను! నీ ప్రేమ నాకు కావాలి. నీతో జీవితాన్ని ఆనందంగా గడపాలి. ఇన్నేళ్లల్లో నీ గురించి నేను అర్థం చేసుకుంది ఒక్కటే నీకు పొగరు, అహంకారం. నీ మనసులో కాస్తో కూస్తో నాకు చోటిస్తున్నావు. కానీ నాతో ప్రేమగా మాట్లాడటానికి నీకు నీ అహం అడ్డొస్తోంది. ఐదేళ్లుగా మీ ఇంట్లో ఒక సభ్యురాలిగా ఉంటున్నాను! అన్ని పనులు చేస్తున్నాను. ఏ రోజైనా ఎందుకు ఇవన్నీ చేస్తున్నావు? మీకు మాకు ఏంటి సంబంధం అని అడిగావా? లేదు. అంత

## మంచి బ్రేక్

**తెలుగులో అల్లరి హీరోయిన్‌గా మారిపోయిన అంకిత ఇప్పుడు 'సీతారాముడు'చిత్రం తనకి మంచి బ్రేక్‌నిస్తుందని ఆశాభావంతో ఉంది. మొన్నామధ్యే ఆడియో విడుదలైన సందర్భంగా ఎంతో హేపీమూడ్‌లో కన్పించిందీ భామ. శివాజీతో కలిసి నటిస్తున్న ఈ చిత్రంలో పాటు హైలైట్ అంటున్నారంతా. అన్నట్టు ఈచిత్రం ఆడియో ఫంక్షన్‌కి అందాలభామలు భూమిక, లయలు హాజరవ్వడం విశేషం.**



వరకు ఎందుకు ఇంతకు ముందు నాపై చేయి చేసుకున్నావు. ఏ అధికారం ఉందని అలా చేశావు. నీ ప్రేమ కోసం ఎంత పరితపించిపోతున్నానో నీకు తెలుసు. ఒక్క మాట అసహ్యంగా మాట్లాడానని నువ్వంత కోపపడ్డావే...రోజా నువ్వే నాపై చూపే అసహనానికి, చిరాకుకు నేనెంత బాధ పడాలి! ఇక చాలు.. నీ ప్రేమ కోసం ఈ ఎదురుచూపుల్లోని ఆనందం విషాదంగా మారకముందే నేను వెళ్లిపోతాను. నీ నుండి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతాను'' అంటూ ఆ ఇంటి నుండి వెళ్లిపోయిందామె.

శోభ వెళ్లిన వైపే దిగ్భ్రాంతిగా చూస్తుండిపోయాడు వినయ్.

మర్నాడు ఉదయం పనిమీద వైజాగ్ క్యాంప్‌కు బయలుదేరుతున్న వినయ్ మది నిండా శోభే. అతడిలో ప్రశ్నల పరంపర నిరంతరంగా కొనసాగుతోంది.

'శోభ ఎవరు? తనకు నాకు ఏంటి సంబంధం? ఆమె నాతో ప్రేమగా మాట్లాడినప్పుడల్లా వాదులాడాలనే ఇంట్రెస్టు నన్ను తరుముకొస్తుంది! తనపై ఇష్టం లేదంటే తను కనిపించినప్పుడల్లా ఏదో ఒకటి మాట్లాడాలనిపిస్తుంది! ఎన్ని మాటలు అన్నా పట్టించుకోదేం? మళ్లీ మళ్లీ నా వెంటే ఎందుకు తిరుగుతుంది?

ఆమె నన్ను అంత తీవ్రంగా ప్రేమిస్తుందా? అబద్ధమైతే ఆడాను కానీ తన గురించి ఆలోచించని క్షణముందా నాలో? నాకు తొలిముద్దు అనుభవాన్ని రుచి చూపించింది శోభ. ఆమె ఏం చేసినా కాదనలేకపోతున్నాను. సమ్ డిఫరెంట్ ఫీలింగ్స్ తనపై..' శోభను గురించి పరిపరి విధాలుగా ఆలోచిస్తూ నడుస్తున్న వినయ్‌కు ఆ పార్క్‌లో ఓ పొదమాటున భోరున విలపిస్తున్న ఓ ప్రేమజంట కనపడింది.

''ప్లీజ్ రవి నేను చెప్పేది విను. మా బాబాయి, పిన్ని నువ్వు కనపడగానే చంపెయ్యమని రౌడీలను పెట్టారు. వాళ్లు నీ కోసం వెదుకుతున్నారు! నువ్వు కనిపించిన మరుక్షణం ఖచ్చితంగా చంపేస్తారు! డబ్బు, పలుకుబడి కోసం ఒక రౌడీకిచ్చి నన్ను కట్టబెట్టాలని చూస్తున్నారు మా బాబాయి, పిన్ని. వాళ్లనుకున్నది జరగకపోతే ఎంతకైనా తెగిస్తారు. ఇంకా ఆలస్యం చేస్తే వాళ్లు ఇక్కడికి వచ్చేస్తారు. నా కళ్లముందు నీ చావును నేను భరించలేను కమాన్ గెట్ రెడీ'' ఆవేశంగా పురుగుల మందు డబ్బా మూత విప్పిందా అమ్మాయి.

''భయపడకు. పరిస్థితి అంతవరకు వస్తే మనం తప్పకుండా సుసైడ్ చేసుకుందాం! ఇప్పుడు మన ముందు ఓ చివరి అవకాశం ఉంది. వెంటనే ఈ ఊరు వదిలి పారిపోవాలి. ముందు దాని గురించి ఆలోచించు'' ఆమెను సముదాయిస్తూ ఆత్రంగా అంటున్నాడతడు.

''ఎలా రవి! ఇప్పటికే వాళ్లు మనకోసం రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌లలో కాపు కాచి ఉంటారు. ఈ పరిస్థితుల్లో మనకు హెల్ప్ చేసే వాళ్లు ఎవ్వరూ లేరు. వాళ్లు ఇక్కడికి వచ్చే లోపే మనం ఈ లోకం వదిలి వెళ్లిపోవాలి.''

''మనకిక చావు తప్ప దారి లేదు'' బాధగా ఆ పురుగుల మందు డబ్బా విప్పి తాగటానికి సంసిద్ధుడయ్యాడతడు. అంతలో ఆ పనిని అడ్డగిస్తూ వారి మధ్యకొచ్చాడు వినయ్.

''వెయిట్.. వెయిట్... తొందరపడి ప్రాణాలు తీసుకోకండి! ఎడబాటును భరించలేక ఆత్మహత్యకు సిద్ధపడుతున్నారంటే మీ ప్రేమెంత బలమైందో తెలుస్తుంది. మిమ్మల్ని ఇక్కడ్నుంచి నేను తప్పిస్తాను! అంతేకాదు మీ పెళ్లి కూడా నేనే దగ్గరుండి జరిపిస్తాను. దయచేసి మీ ప్రయత్నం మానుకోండి! ప్రేమ ప్రాణాలు ఇచ్చేంత గొప్పదని నాకిప్పుడే అర్థమైంది! నన్ను నమ్మండి!!'' స్నేహపూర్వకంగా అంటున్న వినయ్ మాటలను అతడు చూపించే భరోసాను వారిద్దరు నమ్మారు. ఇచ్చిన మాట ప్రకారం వారిరువుర్ని ఎవరి కంటా పడకుండా తన కారులో ఊరు దాటించి దగ్గరుండి మరీ పెళ్లి జరిపించాడు వినయ్.


ఏ సంబంధమూ లేకపోయినా తమకు అంత సాయం చేసిన వినయ్‌కు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలుపుకొని వాళ్లు బొంబాయి వెళ్లిపోయారు. వినయ్‌కు ఎంతో సంతోషంగా ఉంది...! చావు నుండి ఓ ప్రేమజంటను తప్పించి వారి జీవితాలను ఆనందమయం చేశాడు. అతడు ఏనాడు అనుభవించని సంతృప్తికరమైన అనుభూతి అది. ఆ సమయంలో వినయ్‌కు గుర్తుకొచ్చింది ఒకే ఒక్కరు. ఆమే శోభ! తన ప్రేమ కోసం ఆమె ఎంత విలవిలలాడిపోయిందో తలుచుకుంటేనే మనసుకు ఎంతో బాధగా ఉంది. ఆమెను కలిసి ఐ లవ్ యూ చెప్పాలి. ఆ క్షణంలో ఆమె కళ్లల్లో మెరిసే ఆనందాన్ని చూడాలి! వెంటనే తిరుగుప్రయాణమయ్యాడతడు. శోభ ఇంటి ముందు అతడి కారు నెమ్మదిగా వచ్చి ఆగింది. డోర్ తీసుకొని ఆవేశంగా లోపలికొస్తున్న వినయ్‌కు రోదనలు హృదయవిదారకంగా వినిపించాయి. నడకవేగం తగ్గించి శ్రద్ధగా వినసాగాడతడు.

''అమ్మా శోభ... ఎంత పని చేశావు తల్లీ! ప్రేమ కోసం ప్రాణాలు తీసుకున్నావా? అయ్యో.. అమ్మా శోభ...''

వినయ్ కాళ్ల కింద భూమి కంపిస్తున్న

## ఆటవిడుపు

***బిజీగా ఉండే తారలు కాసింత ఆటవిడుపు కావాలనుకోవడం అత్యాశేమీకాదు. అందునా తమ తమ కుటుంబసభ్యులతో కలిసి విహారానికి వెళ్లాలనుకుంటారు. ఈ సమ్మర్ వెకేషన్‌కి గోవా వెళ్లిన కాజోల్, అజయ్‌దేవ్‌గన్‌లు ఎంతో హేపీగా ఫీలయ్యారట. 'ఎప్పుడూ రొటీన్ లైఫ్ నుంచి బయటికి రావాలంటే ఇలాంటివి తప్పనిసరి' అంటున్న కాజోల్ అభిమానుల తాకిడిని తట్టుకోవడం మాత్రం కష్టమే అంటోంది.***



ట్లుగా ఉంది. అతడి నవనాడులు కృంగిపోతున్నాయి. కళ్లల్లో తెలియకుండానే కన్నీరు. ఎదలో గుచ్చుకుపోతున్నాయా రోదనలు. ముందుకు వెళ్లటానికి పాదాలు అతడికి సహకరించటం లేదు.

''శో..భ..'' నోటి వెంట గద్గదంగా వెలువడిందా మాట. దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేక అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ''ఇల్లంతా లక్ష్మీదేవిలా కళకళలాడుతూ తిరిగే పిల్ల ఇలా చేస్తుందని కలలో కూడా ఊహించలేదమ్మా! శోభా...'' ఆ మాటలు వినయ్ చెవిన పడగానే మరింతగా కృంగిపోయాడు. మెల్లగా కంపిస్తున్నాయి చేతులు.

## లైఫ్‌స్టయిల్

**అందాలతార ఐశ్వర్యారాయ్ ఇప్పుడు షూటింగ్స్‌లో చాలా బిజీగా ఉన్నా ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉంటుంది. షూటింగ్స్‌లో ఎంత వేగంగా ఉన్నా కొత్త సినిమాల గురించి వింటూనే ఉంటాను. కొత్త అవకాశాల గురించి ఆలోచిస్తూనే ఉంటాను. 'నా లైఫ్ స్టయిల్ రోజూ రొటీన్‌గానే ఉంటుంది. ఎందుకంటే మన అలవాట్లని బట్టే మన మూడ్స్ ఆధారపడి ఉంటాయి కదా. ఈసంగతి అందరికీ తెలుసు. పనిచేస్తున్నప్పుడు నాకేదో శక్తి వచ్చినట్టుంటుంది' అంటోంది ఐస్.**



హఠాత్తుగా పెద్ద మ్యూజిక్కు. ఆ వెంటనే దాన్ని తగ్గించారెవరో.

''ఎన్నో భాగం వదినా?''

''ఇదే చివరి భాగం తల్లీ! ఇంత విషాదంగా ముగుస్తుందనుకోలేదు!'' దానికి అదే రీతిలో సమాధానం. ఆ రెండు మాటలు చెవిన పడగానే అతడి మెదడు చురుగ్గా కదిలింది. సర్రున పైకి లేచి గుమ్మం దగ్గరకు వేగంగా వెళ్లి చూశాడు. ఇన్నాళ్లు శోభ ఇచ్చిన షాక్‌ల కంటే ఇదో పెద్ద షాక్ అతడికి. ''ఓ...షిట్'' అంటూ తలపట్టుకున్నాడు. హాల్లో అమ్మ, అమ్మమ్మ, శోభ, పిన్ని, వదిన టీవీలో ఓ డైలీ సీరియల్ చూస్తూ భోరున ఏడుస్తున్నారు. అందులో శోభ అనే మెయిన్ కారెక్టర్ చనిపోయి ఉంది. వాళ్ల ఓవర్‌యాక్షన్ చూడగానే నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు వినయ్‌కి. చిర్రున వెనక్కి తిరిగి ఇంటికి చేరుకున్నాడు.

''ఏరా..! నెల రోజులు ఉంటానని చెప్పి అప్పుడే వచ్చావు?'' అతడి చేతిలోని బ్యాగును అందుకుంటూ అడిగింది తల్లి.

''నాకక్కడ ఉండబుద్ధి కాలేదు'' ముభావంగా అంటూ సోఫాలో కూలబడ్డాడతడు.

''అక్కడ వాతావరణం నీకు నచ్చలేదా?!''

''నచ్చింది. కానీ అక్కడ నాకు నచ్చిన మనిషి లేదు'' దిగాలుగా అంటున్న అతడికేసి ఆశ్చర్యంగా పరికించి చూసిందామె.

''అవునూ! శోభ ఏదీ? కనపడడం లేదు'' తన తల్లి ఊహించని ప్రశ్న వేశాడు వినయ్.

''ఢిల్లీ వెళ్లింది! తన కజిన్ ఒకామె అక్కడే ఉందట కదా. ఏదో ఒక జాబ్ చేస్తూ అక్కడే సెటిలవుతానని చెప్పింది''

''సెటిలవుతుందా?'' అతడి కళ్లలో ఆశ్చర్యం.

''అవును! వాళ్ల రిలేటివ్స్‌లలో శోభకు వరసైన వాడు ఉన్నాడట! అతడ్ని పెళ్లి చేసుకొని అక్కడే ఉండిపోతానని చెప్పింది'' వినయ్ ముఖంలోని భావాలను గమనిస్తూ అందామె.

''నేను అర్జెంటుగా శోభతో మాట్లాడాలి! తన సెల్ నెంబరివ్వు''

''తన నెంబర్ నాకు తెలియదురా!''

''ఏంటమ్మా.. ఎప్పుడూ అత్త...అత్త.. అంటూ నీ వెంటేగా తిరుగుతుంటుంది. తన సెల్ నెంబర్ తెలియదా?''

''ఇప్పుడు దానితో అంత అర్జెంటుగా మాట్లాడాల్సిన విషయమేంట్రా?''

''తనంటే నాకిష్టం! ముందు ఆ బ్యాగు ఇచ్చేసేయ్ నేను ఢిల్లీ వెళ్లాలి'' ఆత్రం, ఆవేశం అతడి గొంతుతో.

''ఏంట్రా.. ఉన్నట్టుండీ దాని మీద అంత ప్రేమ పుట్టుకొచ్చింది నీకు! ఇన్నాళ్లు శోభ నీ కోసం ఎంత పరితపించిపోయిందో తెలీదా? ఇప్పటికి నీ రాతి గుండె కరిగిందన్నమాట. పెళ్లి కాకుండానే శోభ ఈ ఇంటి కోడలయిపోయిందిరా. అది చేయని పనంటూ ఉందా ఇక్కడ? దాన్ని చూడడానికి ఢిల్లీ వరకు పోనక్కర్లేదుగానీ, నీ బెడ్‌రూమ్ వరకు వెళ్తే చాలు.. నీ బట్టలు ఉతికి వాటిని ఐరన్ చేస్తూ ఉందా పిచ్చిది! నిన్నొదిలి అదెక్కడికెళ్తుంది?'' అంటూ నవ్వి కిచెన్‌లోకెళ్లిందామె. పట్టరాని సంతోషం వినయ్‌లో. రెండడుగుల్లో తన బెడ్‌రూమ్ చేరుకున్నాడతడు.

దిగాలుగా కూర్చుని అతడి బట్టలు ఐరన్ చేస్తూ ఆలోచిస్తోందామె. నెమ్మదిగా లోనికి వస్తూ తలుపు మూశాడు వినయ్. అతడ్నలా చూసి ఒక్క క్షణం తల విదిలించి 'భ్రమ' అనుకుంటూ పెదవి విరిచి పనిలో నిమగ్నమైపోయిందామె. అంతలోనే అడుగుల చప్పుడు చెవులకు స్పష్టంగా వినిపించింది. తల తిప్పి అతడికేసి చూస్తూ అవాక్కయిపోయి నిల్చుందామె. ఆమె కనురెప్పలు చప్పుడు లేకుండా కొట్టుకుంటున్నాయి.

''ఏం..టి? అలా మీద మీదకొస్తున్నావ్? ఏమైంది నీకు?'' తడబడుతూ అడుగుతోందామె.

''ఐ..లవ్..యూ...!'' దగ్గరగా వచ్చి ఆమె చెవిలో మెల్లిగా అన్నాడతడు.

గడసరిగా అమాంతం అతడ్ని కావలించుకుందామె. ఆమె నడుం మడతపై నొక్కిపట్టి దగ్గరకు తీసుకుంటూ ఒళ్లంతా ముద్దుల వర్షం కురిపించాడతడు.

అతగాడి మదిని ప్రేమనే కవ్వంతో చిలికిన ఆమెకు అప్పటికి లభించింది ప్రణయామృతం!

★